సాక్షి
వికారాబాద్
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



చేవెళ్ల అభివృద్ధికి కృషి

చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ ఇచ్చారు. 8లో▸



ప్రాంతాలపై వివక్ష

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాంతాలపై వివక్ష చూపారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి ఆరోపించారు. 8లో▸



ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

రాఘవాపూర్‌లో కొలువుదీరిన రక్షమైసమ్మ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన శంకర్ స్వామీజీ



బషీరాబాద్: తెలంగాణ సాధూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, దామర్‌చెడ్ భవానీమాత పీఠాధిపతి శ్రీ శంకర్ స్వామీజీ ఆదివారం న్యూఢిల్లీలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కలిశారు. దేశవ్యాప్తంగా శంకర్ స్వామీజీ చేపట్టిన 'లక్ష గృహాలు.. లక్ష్మీ నిలయాలు' అనే కార్యక్రమం ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర మంత్రి అన్నారు. సనాతన ధర్మ ప్రచారంలో శంకర్ స్వామిజీ చేస్తున్న కృషిని అభినందించారు. దళిత మహిళలకు పాదపూజ వంటి కార్యక్రమాలు చేయడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఇక ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

వానరానికి అంత్యక్రియలు



దుద్యాల్: వానరానికి అంత్యక్రియలు చేసిన ఘటన మండలంలోని హస్నాబాద్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాయికోటి కుటుంబ సభ్యులు సాయప్ప, వెంకటప్ప, శేఖర్, ఆరుణ్‌లకు గ్రామ శివారులో పొలం ఉంది. ఉదయం వారు పొలానికి వెళ్లగా చెట్టు కింద వానరం కళేబరం కనిపించింది. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా క్రాంతి



కొడంగల్: సీపీఎస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇల్లూరి క్రాంతికుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం వికారాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్(టీజీ సీపీఎస్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. పాత పెన్షన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న యూపీఎస్ తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాలని కోరారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు



పతకాలు సాధించిన విద్యార్థినులు

దుద్యాల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీల్లో మండల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభినయ శ్రీ బంగారు పతకం సాధించగా.. సంధ్యారాణి, అక్షిత రజత పతకాలు సొంతం చేసుకున్నారు. మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీకి చెందిన శిరీష, నికిత బంగారు పతకాలు సాధించగా అనిత, శివాని, సోనాలి, ఆద్య వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. హస్నాబాద్ నేతాజీ ఉన్నత పాఠశాలకు చెందిన రిత్విక బంగారు పతకం సాధించింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల: మున్సిపల్ కార్మికులకు జీఓ నం. 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలోని కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటంతో పాటు పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు యూనిఫామ్స్ గుర్తింపు కార్డులు అందించాలని, విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న యువత

కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది.. పలు ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో వచ్చి సేదతీరుతున్నారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అడవి మధ్యలో ఉన్న ఈ ప్రాజెక్టు అందాలను వీక్షించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటోంది.

– ధారూరు



ప్రాజెక్టు అలుగు నీటిలో సేదతీరుతున్న పర్యాటకులు

శర వేగంగా..

కొడంగల్‌లో చురుగ్గా సాగుతున్న అభివృద్ధి పనులు



ఇటీవల పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

- సీఎం రేవంత్ చొరవతో భారీగా నిధులు
- ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, సమీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిత్యం ఇక్కడ జరిగే పనులను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో అహర్నిశలు అప్రమత్తంగా ఉంటున్నారు. అభివృద్ధి పనులను పరుగులు పట్టిస్తున్నారు. 8 మండలాలు 4 లక్షల జనాభాతో పెద్ద నియోజకవర్గంగా పేరుగాంచింది.

చేపట్టిన అభివృద్ధి పనులు

కొడంగల్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో వివిధ పనులకు రూ.5వేల కోట్లు మంజూరు చేశారు. కళాశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం భూములను గుర్తించారు. ప్రభుత్వ అసైన్‌మెంట్, అటవీ, అన్యాక్రాంతమైన, సాగులో లేని భూములను సేకరిస్తున్నారు.

- నియోజవకర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు. ఒక్కో కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలకు ఒక్కో మండలానికి రూ.7.13 కోట్ల చొప్పున రెండు మండలాలకు కలిపి రూ.14.26 కోట్లు విడుదల చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణాలు మౌలిక సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంజూరు చేశారు. భవనాలు, ఇతర అవసరాల కోసం రూ.46 కోట్లు కేటాయించారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. దీని కోసం రూ.27 కోట్లు విడుదల చేశారు.
- కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీనికి రూ.27 కోట్లు కేటాయించారు.
- కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు మంజూరు చేశారు. దీని సామర్థ్యం పెంచి నిధులను రెట్టింపు చేశారు.
- కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మార్చి రూ.30 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.20 కోట్లతో భవనాలు, రూ.10 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.
- కోస్గిలో నూతనంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. భవనాలు, ఇతర సదుపాయాల కోసం రూ.11 కోట్లు మంజూరు చేశారు.
- సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు ఆధునాతన వసతులతో కొత్త భవనాలు మంజూరు చేశారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లో ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారు.
- నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు విడుదలయ్యాయి.

భవిష్యత్తులో రెండు నియోజకవర్గాలు!

కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రవేశపెడితే కొడంగల్‌లో మరో కొత్త నియోజకర్గం ఏర్పాటు కానుంది. కొడంగల్‌ను రెండు భాగాలుగా చేస్తారనే ప్రచారం ఉంది. నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్న కోస్గి లేదా మద్దూరు మున్సిపాలిటీలను ఏదో ఒకదాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోకి నాలుగు మండలాలు కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల, కొత్తగా ఏర్పడబోయే నియోజవర్గ పరిధిలోకి కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలను కలిపే అవకాశం ఉంది.

- పలు పాఠశాలల్లో భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారు.

కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి సోలార్ వ్యవస్థను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహారం అందించడానికి హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు బాధ్యతలు అప్పగించారు.

పెద్ద నియోజకవర్గంగా పేరు

కొడంగల్ అసెంబ్లీ స్థానానికి ఒక ప్రత్యేకత ఉంది. గతంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు మండలాలు ఉండేవి. కొత్తగా మూడు మండలాలు ఏర్పడ్డాయి. బొంరాస్‌పేట మండలంలో దుద్యాల్, కోసిగి మండలంలో గుండుమాల్, మద్దూరు మండలంలో కొత్తపల్లి గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. తెలంగాణలో అధిక మండలాలు కలిగిన నియోజకవర్గంగా కొడంగల్‌కు పేరుంది.

2,46,526 మంది ఓటర్లు

నియోజకవర్గంలో 2,46,526 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,20,879 మంది, స్త్రీలు 1,25,640 మంది, ఇతరులు ఏడుగురు ఓటర్లు ఉన్నారు. దౌల్తాబాద్ మండలంలో మొత్తం 40,687 మంది, మద్దూరులో 38,789 మంది, కొత్తపల్లి మండలంలో 16,761 మంది, కోస్గి మండలంలో 36,404 మంది, గుండుమాల్‌లో 17,569 మంది, బొంరాస్‌పేటలో 32,388 మంది, దుద్యాల్‌లో 24,537 మంది, కొడంగల్‌లో 39,391 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంత మంది ఓటర్లు ఓటు వేసే అవకాశం ఉంది.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్

అనంతగిరి: నేటి నుంచి జరిగే ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపారు. పరీక్షలు ప్రారంభమైన 15 నిమిషాల తర్వాత విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. ఇంటర్ జనరల్ ద్వితీయ సంవత్సరంలో 3,782, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 797 మంది, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 1,336 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షల కోసం 38 సెంటర్లు, ఒకేషనల్ పరీక్షల కోసం 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిత్యం రెండు విడతల్లో బ్యాచ్‌ల వారీగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్లు, ప్రాక్టికల్స్ టైమ్ టేబుల్ వారు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాళ్ల వద్ద తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు.

లక్ష్యం.. శతశాతం

- పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి
- మున్సిపాల్టీల్లో స్పెషల్ డ్రైవ్‌లు
- టార్గెట్ పూర్తి చేసేందుకు చర్యలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం/తుక్కుగూడ: మున్సిపాలిటీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి గడువు సమీపిస్తుండడంతో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి టార్గెట్ పూర్తి చేయాలని భావిస్తోంది. మూడునాలుగేళ్లుగా మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయ వనరులు తగ్గాయి. సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి పనులకు డబ్బులు కావాలంటే భవన నిర్మాణాల అనుమతులు, బెటర్‌మెంట్ చార్జీలు, వాణిజ్య దుకాణాల లైసెన్స్ చార్జీలతో పాటు వివిధ పన్నుల రూపేనా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పూర్తిస్థాయి పన్నులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వసూళ్లు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇంటింటికీ, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు, విద్యాసంస్థల వెంట తిరుగుతూ పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత వారికి అప్పగించారు. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు నోటీసులు అందజేస్తున్నారు. పన్నులు చెల్లించకుంటే ఆయా భవనాలను సీజ్ చేసేందుకు వెనుకాడమని హెచ్చరిస్తున్నారు.

'పట్నం' మున్సిపల్ పరిధిలో..

పన్నుల వసూళ్లలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వెనుకబడింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి టార్గెట్ రూ.13.09 కోట్లు కాగా అందులో పాత బకాయిలే రూ.6.55 కోట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.2.91 కోట్లు మాత్రమే రాబట్టగలిగారు. మున్సిపాలిటీలో గృహ, వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలకు సంబంధించి సుమారు 7,239 భవనాలకు పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన పన్నులు పక్కన పెడితే ఇతర మార్గాల ద్వారా సుమారు రూ.6 కోట్ల పన్నులు మార్చి 31 ముగిసేలోపు రాబట్టాల్సి ఉంది.

తుక్కుగూడ పరిధిలో..

మున్సిపల్ పరిధిలోని తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, దేవేందర్‌నగర్‌కాలనీ, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో 7,098 గృహాలు, 285 వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.6.72 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు బిల్ కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటి వరకు రూ.3 కోట్లకు పైగా (52 శాతం) వసూలు చేశారు. మిగిలిన మొత్తం వసూలు చేయడానికి పుర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆటో వాహనానికి మైక్ ఉంచి ప్రతి వార్డులో చాటింపు వేస్తున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీకి పుర ప్రజల నుంచి ఆదాయ పన్ను కాకుండా ఫ్యాబ్‌సిటీ– హార్డువేరు పార్కు, మంఖాల్ పారిశ్రామిక వాడ తదితర పరిశ్రమల వద్ద టీఎస్ఐడీఎస్ వసూలు చేసిన ఆదాయ పన్నులో 40 శాతం మేరకు అందజేస్తారు. గత ఏడాది 92 శాతం ఆదాయ పన్నును అధికారులు వసూలు చేశారు.

జలం.. పాతాళం!

- వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం
- డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో మరింత లోతుకు
- ఇప్పటికే ఆగిపోతున్న వ్యవసాయ మోటార్లు
- పల్లెల్లో అప్పుడే మొదలైన తాగునీటి ఎద్దడి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూగర్భజలాలు జిల్లాలో వేగంగా పడిపోతున్నాయి. గత డిసెంబర్‌లో సగటు భూగర్భ జలమట్టం ఆనవాళ్లు 9.08 మీటర్ల లోతులో కన్పించగా తాజాగా 10.13 మీటర్ల లోతుకు (1.05 మీటర్ల లోతుకు) పడిపోయాయి. వేసవి ప్రారంభానికి ముందే వ్యవసాయ బోర్లు ఆగిపోస్తుండగా గృహ, వాణిజ్య సంస్థల్లో అప్పుడే నీటికి కటకట మొదలైంది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 87 ఫీజో మీటర్లు ఉండగా ఇబ్రహీంపట్నంలో 15.75 మీటర్ల లోతుకు పడిపోతే.. సరూర్‌నగర్‌లో 14.80 మీటర్లు, శేరిలింగంపల్లిలో 13.97 మీటర్ల లోతుకు చేరడం గమనార్హం. ఇక నందిగామ, ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో నీటి ఆనవాళ్లు ఆశించిన దానికంటే పైనే కన్పిస్తుండడం విశేషం.

పల్లెల్లో మొదలైన కటకట

చెరువులు, కుంటలు ధ్వంసం చేయడం, నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేయకపోవడం, కొండలు, గుట్టలను చదును చేస్తుండటం, చెట్లను నరికివేస్తుండటం, గేటెట్ కమ్యూనిటీలు, విల్లాలు, ఫాంహౌస్‌లు, పరిశ్రమల పేరుతో భారీగా నిర్మాణాలు చేపడుతుండటం భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటానికి కారణమవుతున్నాయి. ఇంటి చుట్టూ రోడ్లు, ఇతర అవసరాల కోసం కాంక్రీట్ వేస్తుండటం, వర్షపు నీరు భూమిలోపలికి ఇంకేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయకపోవడం, పంట పొలాల్లోనే కాదు గృహ, వాణిజ్య సముదాయాల్లోనూ అవసరానికి మించి నీటిని వినియోగిస్తుండడం కూడా కారణమవుతున్నాయి. గ్రామాల్లోని బోర్లు కూడా సరిగా పోయడం లేదు. అవసరాల మేరకు నీరు సరఫరా కావడం లేదు. గత నెల వరకు ప్రతి రోజూ నల్లాల్లో నీరు వచ్చేది. తాజాగా రోజు విడిచి రోజు వదులుతుండటమే ఇందుకు నిదర్శనం.



క్రీడలతో స్నేహభావం

స్పీకర్ ప్రసాద్ కుమార్

అనంతగిరి: క్రీడలతో శారీరక దారుఢ్యం, స్నేహభావం పెంపొందుతుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో మాస్టర్ జపాన్ షోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరవ నేషనల్ ఓపెన్ కరాటే, కుంపూ రాష్ట్రస్థాయి చాంపియన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన స్పీకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహమ్మద్ ఖాజా పాషా, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, పలువురు కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కేటీఆర్.. చిల్లర రాజకీయాలు మానుకో..

- ప్రజలు చిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదు
- చచ్చిన పార్టీని బతికించుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు
- విలేకరుల సమావేశంలో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కుల్కచర్ల మండలంలో మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వచ్చిన కేటీఆర్ చిల్లర రాజకీయాలు చేశారని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేకుంటే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి హితవు పలికారు. ఆదివారం పరిగి పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రజలు చిత్తుగా ఓడించినా తండ్రీ కొడుకులకు బుద్ధిరాలేదన్నారు. కేటీఆర్.. సీఎంపై సొల్లు వాగుడు ఆపాలని హితవు పలికారు. బీఆర్ఎస్ హయాంలో పథకాల అమలు బాగుందో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో బాగుందో ప్రజల వద్దకు వెళ్లి చర్చిద్దామని సవాల్ విసిరారు.. కేసీఆర్ చరిత్ర తెలిసే ప్రజలు ఫాంహౌస్‌లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ప్రజా ఉద్యమాలతో సీఎం అయ్యారని పేర్కొన్నారు.. కేసీఆర్ అంటే నమ్మక ద్రోహం అని.. రాష్ట్రానికి పట్టిన చీడపురుగు అని.. అందుకే ప్రజలు ఓడించారన్నారు. రాష్ట్రంలో చచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని ఎలా బతికించుకోవాలో తెలియక తిప్పలు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబానిది నీచమైన చరిత్ర అని.. నీ చెల్లెలు లిక్కర్ స్కాంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని అంతర్జాతీయంగా మంటగలిపావని అన్నారు.. కేసీఆర్ పదేళ్లలో చేసింది మేము అధికారం చేపట్టిన ఏడాదిలోనే చేసి చూపించామన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రూ.62 వేల కోట్లు రైతుల సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. రూ.23 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద గత ఏడాది రూ.12వేల కోట్లు ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ ఇస్తున్నామన్నారు. జనవరి 26న ఒకే సారి నాలుగు పథకాలను అమలు చేశామని పేర్కొన్నారు. తండ్రి, కొడుకులు ఎప్పుడైనా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. పరిగి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఆంజనేయులు, ఆనందం, అశోక్, అయూబ్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

ధారూరు: అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపారు. ఆదివారం రాస్నం అటవీ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ వీరబాబు, సిబ్బంది ఒమేర్, శ్రీధర్ ధారూరు ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. దేవనూర్ సమీపంలోని వాగు నుంచి ఇసుక తరిలిస్తున్నారని తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



చాకలి కిష్టప్ప(ఫైల్)

బంట్వారం: నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన బంట్వారం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం. బంట్వారం గ్రామానికి చెందిన చాకలి కిష్టప్ప(63) పొలం నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో నర్సింలు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి కిష్టప్పను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిష్టప్ప తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు వెంటనే తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యుల సూచన మేరకు నగరానికి తీసుకెళ్తుండగా శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని మృత దేహానికి మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం జరిపించినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ

ఆరుగురికి గాయాలు



ప్రమాద స్థలంలో వాహనాలను క్లియర్ చేస్తున్న పోలీసులు

పరిగి: హైదారాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలైన సంఘటన పరిగి శివారులోని రాజాధాని దాబా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాలకు చెందిన ఆరుగురు యువకులు హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్తుండగా, కొడంగల్ నుంచి పరిగికి వెళ్తున్నా కారు ముందు ఉన్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రణాపాయం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అగ్ని ప్రమాదంలో యువకుడి మృతి

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన సాయి సత్య శ్రీనివాస్ (30) రెండేళ్లుగా దాసరి సంజీవయ్య కాలనీలోని ఓ ఇంట్లో నివాసం ఉంటూ పటాన్‌చెరు ప్రాంతంలోని కెమికల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు తెలిపారు.

‘108’ భేష్..!

- అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన సేవలు
- ప్రాణదాతలుగా నిలిచిన వాహన సిబ్బంది

కొడంగల్ రూరల్: ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు.. ప్రాణాపాయ స్థితిలో 108 వాహనంలోని సిబ్బంది సరైన సమయంలో ఆస్పత్రులకు చేరుస్తున్నారు. సంబంధిత వ్యక్తుల ప్రాణాలు కాపాడుతున్నారు. ఈ విషయంలో సిబ్బంది సేవలను పలువురు కొనియాడుతున్నారు. అయితే ఇందులో పనిచేసే సిబ్బంది అంకితభావంతో ఉండి వేల సంఖ్యల్లో ప్రాణాలను కాపాడగలుగుతున్నారు. అనుక్షణం వారు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడ ఏ ప్రమాదం చోటుచేసుకున్నా సరైన సమయంలో చేరుకుని ఎంతో మందికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ఈ విషయంలో మెరుపు వేగంతో స్పందించి ప్రమాదాలకు గురైనవారిని సమీపంలోని వైద్యశాలలకు తరలిస్తూ తమవంతు విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా ఎక్కడ, ఎప్పుడు ఏ ప్రమాదం జరిగినా అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు 108 వాహనాన్ని ప్రారంభించారు. 108కి ఒక్క కాల్ చేయడంతో పైసా ఖర్చు లేకుండానే ఆస్పత్రులకు తరలిస్తూ ప్రాణాలను కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. సంఘటన స్థలంలోనే అవసరమైతే ప్రథమ చికిత్స నిర్వహించి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్(ఈఎంటి) ప్రాణాలు కాపాడటంలో చురుకైన పాత్ర పోశిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, వాంతులు, విరేచనాలు, అస్వస్థతకు గురైన వారు, ఆత్మహత్యా యత్నాలు, రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యాలకు గురైనవారు, గుండెనొప్పి, దగ్గు, దమ్ముతో బాధపడేవారు ఇలా ఎంతోమందికి ఎన్నో సందర్భాలలో పునర్జన్మ ప్రసాదించారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సౌకర్యం, డెలివరీ కిట్, ఎవరైనా పురుగు మందు తాగినా వారిని కాపాడడానికి కావాల్సిన ఎమర్జెన్సీ పరికరాలతో ప్రాథమిక చికిత్స నిర్వహిస్తారు. ప్రమాదంలో ఎముకలు విరిగితే సపోర్టుగా ఉంచడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రసవ సమయంలో ఆస్పత్రికి తరలించేక్రమంలో పరిస్థితి చేయిదాటితే సిబ్బందే పురుడు పోసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. జిల్లాలో 18మండలాల్లో 16వాహనాలు, ఒక నియోనటల్ (చిన్నారుల) వాహనంతో సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో గతేడాది 2024, జనవరి నుంచి 2025, జనవరి చివరి వరకు ఆర్టీఏ కేసులు 2,764, గర్భిణులు 3149, ఇతరత్రా కేసులు 9447లతో మొత్తం 15,360 కేసులను వాహనాల్లో చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. నియోనటల్ వాహనంతో జిల్లాలో ఏడాది కాలంలో 780మంది చిన్నారులకు వివిధ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఎంతో మంది ప్రాణాలు కాపాడి 108 వాహన సిబ్బంది ఆపద్బాంధవులుగా నిలిచారు.



108 వాహనంలోనే మహిళ ప్రసవం (ఫైల్)

గర్వంగా ఉంది



108 వాహనంలో ఉద్యోగం చేయడం గర్వంగా ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు అవసరమైతే వాహనంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహిస్తూ ఆస్పత్రులకు తరలిస్తాం. బాధిత కుటుంబసభ్యులు బాధపడుతూనే మమ్మల్ని అభినందిస్తుంటారు.

– అశోక్, ఈఎంటీ, కొడంగల్

ప్రాణాలు కాపాడటమే ముఖ్యం



ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు సమాచారం ఇస్తే వీలైనంత తొందరగా వెళ్లడానికి ప్రయత్నిస్తాం. ఏదైనా అనుకోని సందర్భాల్లో ఆలస్యమైతే బాధితులు కోపగించుకుంటారు. అవేమీ పట్టించుకోకుండా ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తాం.

– రమేష్, పైలెట్, కొడంగల్

సంఘటనా స్థలంలో..



ప్రమాదాలు జరిగినప్పుడు చాలా మంది ఫోన్లు చేస్తారు. సంఘటనా స్థలంలో వెళ్లాక అక్కడ ఉండే వారు క్షతగాత్రులను వాహనాల్లో ఎక్కించేందుకు వెనకడుగు వేస్తారు. అలాంటి వారిలో మార్పు రావాలి.

– ఆంజనేయులు, ఈఎంటీ, దౌల్తాబాద్

వాహనానికి దారి ఇవ్వాలి



ప్రమాదాలు సంభవించినప్పుడు వాహనం సైరన్ కొడుతూ వెళుతున్న క్రమంలో తోటి వాహనదారులు పక్కకు తప్పుకుంటే క్షతగాత్రులకు ఎంతో కొంత మేలు చేసినవారవుతారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రులు ప్రమాదాల నుంచి బయటపడ్డారని తెలిస్తే ఎంతో సంతోషిస్తాం.

– ఖలీమ్, పైలెట్, దౌల్తాబాద్

మెరుగైన సేవే లక్ష్యం



జిల్లాలో 18మండలాల పరిధిలో 16వాహనాల ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 108కి కాల్ చేయడం ద్వారా మెరుపు వేగంతో సంఘటనా స్థలానికి చేరేందుకు వాహన పైలట్లు, క్షతగాత్రులకు వాహనాల్లో, సంఘటనా స్థలాల్లో ఈఎంటీలు చికిత్స నందిస్తూ ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు కృషిచేస్తారు.

– శ్రీకాంత్, ఉమ్మడి జిల్లా, ప్రోగ్రాం మేనేజర్

అహంకారం వీడాలి

ఆధ్యాత్మిక వేత్త, వక్త భాస్కరయోగి

పరిగి: ప్రజలు అహంకారం వీడి, ఓంకారం వైపు నడవాలని ఆధ్యాత్మిక వేత్త, వక్త భాస్కరయోగి పేర్కొన్నారు. భాస్కరయోగి ఫౌండేషన్, హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో పరిగి పట్టణ కేంద్రంలో ఆదివారం మాఘ సత్సంగం ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత మానవ జీవిత పరిపూర్ణ లక్ష్యానికి కారణమవుతుందన్నారు. అందుకు జ్ఞానం ఆధారమవుతుందని, జ్ఞానం లేకుండా చేసే ఎలాంటి కార్యకలాపాలైనా నిరర్థకమేనన్నారు. శాస్త్రము ఉపదేశించిన కార్యకలాపాలను నిష్ఠగా ఆచరించడమే సనాతన ధర్మం యొక్క మూల సూత్రమన్నారు. ఉపనిషత్తులు, ఋషులు చెప్పిన పరమాత్మ ఉపాసన అనే పారమార్థిక మార్గం మానవ జీవితాన్ని తరింపజేస్తుందని తెలిపారు. మానవ జీవితాన్ని అత్యుత్తమ జీవితంగా శాస్త్రాలు పేర్కొనడం వల్ల ధర్మము అనే నావపై ఎక్కి మోక్షం అనే తీర్థం చేరుకోవాలని సూచించారు. గురుముఖత శాస్త్రాలు విని ధర్మలు తెలుసుకొని జీవితం గడిపినట్లయితే కష్టనష్టాలు ఉండకుండా పరమేశ్వరుడు ఎల్లప్పుడూ పరిరక్షిస్తుంటాడన్నారు. అనంతరం సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ ఈ దేశంలో సమరసతా కోసం ఎంతో మంది మహనీయులు పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాండురంగాచారి, నరేందర్‌రెడ్డి, ప్రకాశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్సంగంలో పాల్గొన్న వక్తలు

చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



వెంకటేశ్‌కి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డ అభివృద్ధి కోసం నిరంతరం కొట్లాడుతూనే ఉంటాయని ఆనాడే స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి స్పష్టం చేశారని, ప్రస్తుతం అదే బాటలో తాము నడుస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రకటించారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం జన్వాడలో మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్ తన అనుచరులు దాదాపు 500మందితో కలిసి మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకి జన్వాడవాసులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. జన్వాడ గ్రామం తన ఊరని ఎప్పుడూ స్వర్గీయ ఇంద్రారెడ్డి చెప్పుకొనే వారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో చెప్పే అభివృద్ధి చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాట్లాడే అవకాశం వచ్చిన ప్రతిసారి మాజీ సీఎం కేసీఆర్‌ని దూషించి కాలాన్ని వృధా చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 58 మంది విద్యార్థులు, పదుల సంఖ్యలో పోలీసులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం బాధాకరమన్నారు. జన్వాడ గ్రామాన్ని ఎవరి అనుమతి లేకుండా మున్సిపాలిటీలో కలపడం ఏంటని, దీనిపై కోర్టులో కేసు వేసి, పోరాటం చేస్తానని, ఎవరూ అధైర్యపడోద్దని భరోసాని ఇచ్చారు. బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక్క సంవత్సరంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విరక్తి వచ్చిందని, మళ్లీ కేసీఆర్‌యే సీఎం కావాలని ప్రజలకు కోరుకుంటున్నారన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రాంతాలపై వివక్ష

- కొడంగల్‌ను ఎడారి చేశారు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు

బొంరాస్‌పేట: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాంతాలపై వివక్ష చూపారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకొని పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఆ నీటితో ఈ ప్రాంత ప్రజల పాదాలు కడుగుతామని హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కొడంగల్‌కు మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, ఐటీఐ, జూనియర్ కళాశాలలు మంజూరు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ నర్సింలు నాయుడు, సంగాయిపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

వరకట్న వేధింపులు తాళలేక..

మహిళ ఆత్మహత్య

ఉప్పల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా, మోత్కూరు మండలం, పాటిమట్ల గ్రామానికి చెందిన భోరెడ్డి రాజశేఖర్ రెడ్డికి గుండాల మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన మలిపెద్ది రవళి(25)తో 2019లో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన వారు ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్నేళ్లుగా రవళిని అత్తమామలు, ఆడబిడ్డలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. పలు మార్లు పెద్ద మనుషులు జోక్యం చేసుకుని నచ్చజెప్పినా వారి వైఖరి మారలేదు. ఏడాది క్రితం రాజశేఖర్ రెడ్డి భార్యను వదిలేసి స్వగ్రామానికి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి రవళి ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి లోనైన ఆమె శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వరకట్న వేధింపుల కారణంగానే తన కుమార్తె అత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రజిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత కొంత కాలంగా పిల్లలిద్దరూ తండ్రి వద్దనే ఉంటున్నట్లు సమాచారం.



రవళి(ఫైల్)

రాత్రిపూట డీజేల హోరు

శబ్దాలకు మృత్యువాత పడిన కోళ్లు

- ఫాంహౌస్‌లలో పెచ్చుమీరుతున్న వింత ధోరణి

మొయినాబాద్: ఫాంహౌస్‌లో రాత్రి సమయంలో డీజేల హోరు మార్మోగుతుంది. భయంకరమైన ఈ శబ్దాలకు ఫారంలోని కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురంగల్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ రెవెన్యూలోని బ్రిడ్జ్ ఫాం వెంచర్‌లోని ఓ ఫాంహౌస్‌లో నిత్యం ఈవెంట్లు, పార్టీలు జరుగుతున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు రాత్రంతా డీజేలతో హోరెత్తిస్తారు. శనివారం రాత్రి సైతం ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహిస్తూ డీజే సౌండ్ ఏర్పాటుచేశారు. భయంకరమైన శబ్దాలకు ఫాంహౌస్ పక్కన ఉన్న గడ్డం వెంకట్‌రెడ్డి ఫాంలో పెంచుతున్న కోళ్లు మృత్యువాతపడ్డాయి. సుమారు వంద కోళ్లకు పైగా మృతి చెందడంతో తీవ్ర నష్టం జరిగిందని బాధితుడు లబోదిబోమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

మొయినాబాద్ ప్రాంతంలో వందల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. ప్రతి రోజు ఫాంహౌస్‌ల్లో ఈవెంట్లు, పార్టీలు, వేడుకలు జరుగుతూనే ఉంటాయి. అయితే ఫాంహౌస్‌లో జరిగే పార్టీలు, ఈవెంట్లలో డీజేలు పెట్టడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే చాలా గ్రామాల ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ ఫిర్యాదులను పోలీసులు చెత్తబుట్టలో పడేస్తున్నారు. ఎప్పుడైన పెద్ద ఘటన జరిగితే నిర్వాహకులపై చిన్న పిట్టీ కేసు పెట్టి వదిలేస్తున్నారు. ఫాంహౌస్‌ల నుంచి పోలీసులకు అందుతున్న మామూళ్లే దీనికి ప్రధాన కారణం అనే ఆరోపణలున్నాయి. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేసే పోలీసులు ఫాంహౌస్‌లకు వెళ్లి అక్కడ ఎలాంటి ఈవెంట్లు, పార్టీలు, వేడుకలు జరిగినా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని సమాచారం. ఇందులో ఉన్నతాధికారులకు సైతం వాటాలు వెళ్తున్నట్లు తెలుస్తుంది. అందుకే ఫాంహౌస్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, అనుమతి లేకుండా డీజేలు, లిక్కర్ వినియోగిస్తున్నా స్థానిక పోలీసులు పట్టించుకోవడంలేదు. ఎప్పుడైనా ఎస్ఓటీ పోలీసులు ఫాంహౌస్‌లపై దాడులు చేస్తేనే స్థానిక పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌లలో జరుగుతున్న కార్యకలాపాలపై, ఫాంహౌస్‌ల పట్ల స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటల్లో ‘అమ్మ’ల సత్తా

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు కైవసం

తాండూరు: జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో తాండూరుకు చెందిన ఇద్దరు అమ్మలు పతకాలు సాధించి సత్తా చాటారు. ఒకరు 35–40 వయస్సు కలిగిన విభాగంలో హై జంప్‌లో బంగారు పతకం, మరొకరు 45–50 వయస్సు విభాగంలో ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలను సాధించి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలను సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో రాణించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

అంతర్జాతీయ స్థాయికి..

తాండూరు పట్టణానికి చెందిన నవనీత 35–40 వయస్సు కలిగిన విభాగంలో హైజంప్‌లో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ఓడించి బంగారు పతకం సాధించారు. ఈమె పేద కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదువుకొంది. 2010 సంవత్సరంలో మహేష్ అనే వ్యక్తితో పెళ్లి నిర్వహించారు. ఆమెకు చదువుపై ఉన్న శ్రద్ధను గమనించిన భర్త పెళ్లైన తర్వాత కూడా చదివించాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఓ వైపు కుటుంబాన్ని చూసుకుంటునే ఆమె ఆటలపై ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకుంది. ప్రతిభకు పేదరికం అడ్డుకాదంటూ జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది. త్వరలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు నవనీత ఎంపికైంది.



బంగారు పతకం సాధించిన నవనీత

48 ఏళ్ల వయస్సులో..

తాండూరు పట్టణానికి చెందిన మంకాల్ సంతోషి కుమారి మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో ట్రిపుల్ జంప్‌లో విజయం సాధించి కాంస్యపతకం అందుకుంది. 45నుంచి 50 వయస్సు విభాగంలో 48 ఏళ్ల ఆమె గత నెల 4వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆదివారం త్రిశూర్ జిల్లాలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించి కాంస్యపతకం దక్కించుకున్నారు. సంతోషికి భర్త నటరాజ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించిన సంతోషికుమారి

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ బలరాం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి(55) జనవరి 24న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో స్పృహ తప్పి పడిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొదుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించినా వివరాలు తెలియరాలేదు. మృతుడి ఒంటిపై బూడిద రంగు షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతికి దారం కట్టుకున్నాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 8712663329, 8712568289 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పోష్ పబ్‌లో తనిఖీలు

కాలం చెల్లిన ఆహార పదార్థాల గుర్తింపు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని పోష్ నోష్ పబ్‌తో పాటు కిష్కింధ కిచెన్ హోటల్‌లో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించిన అధికారులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను, నిత్యావసర సరుకులను సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు కూడా శుభ్రంగా లేవని తెలిపారు. మంచినీటి నాణ్యతా నివేదికలు, చెదల నివారణ రికార్డులను కూడా చూపించలేదు. కిచెన్‌లో బొద్దింకలు తిరుగుతున్నట్లుగా నిర్ధారించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

- పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు తప్పదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హెచ్చరించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఎలాంటి ఊరట దక్కలేదన్నారు. కేవలం బడా పారిశ్రామికవేత్తలకే ప్రయోజనం చేకూర్చేలా ఉందని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం యాచారంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద సాగర్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులు, కార్మికులు, పేదలకు ఏ మాత్రం ఉపయోగం లేని విధంగా ఉందని మండిపడ్డారు. కేంద్రంలో మూడు దఫాలుగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంతో పేదలకు ఒరిగిందేమి లేదన్నారు. రైతాంగానికి, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు తెస్తూ మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, జగన్, వినోద్, లాజర్, విప్లవ్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కరాటే పోటీలో చిన్నారి సత్తా

షాబాద్: కరాటే పోటీలో చిన్నారి జ్ఞానతేజ గోల్డ్ మెడల్ సాధించింది. మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల విజయ్ శేఖర్, ప్రభావతి కూతురు జ్ఞానతేజ.. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన ఓపెన్ శివ మొగ్గ 2025– 8వ ఇంటర్నేషనల్ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. జ్ఞానతేజ మొయినాబాద్ మండలంలోని సుజాత ఇంటర్నేషనల్ స్కూల్లో మూడో తరగతి చదువుతుంది. గ్లోవింగ్ షూట్ కాన్ కరాటే అకాడమీలో శిక్షణ తీసుకుంది. మాస్టర్ సింహన్, సుధాకర్ చిన్నారికి తర్ఫీదు ఇచ్చారు. చిన్నారి గోల్డ్ మెడల్ సాధించడంతో పలువురు అభినందించారు.



జ్ఞానతేజకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు